కడంపల్లి వంతెనకు కదిలారు

కాడ అధికారికి సమస్య వివరించిన నాయకులు



కొడంగల్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ(కాడ) ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భారాస నాయకులు

ఈనాడు మీ తోడు

కోస్గి మండలం కడంపల్లి వద్ద వాగుపై వంతెన లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కడంపల్లి, హన్మాన్‌పల్లి, భలభద్రాయపల్లి, వడ్డుకింద తండా, దానిమ్మతండా, భక్తిమళ్ల ప్రజలు నేరుగా ప్రభావితమవుతున్నారు. ఏమాత్రం చినుకు పడి వాగులోకి నీరొస్తే రాకపోకలు ఆగిపోతాయి. ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి కోస్గి చేరుకోవాలి. విద్యార్థులు, రోగులు, వృద్ధులు పడే బాధలు వర్ణనాతీతం. ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో 'ఈనాడు' పలు కథనాలు ప్రచురించింది. ప్రజల నుంచి యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. నిధులు సిద్ధంగా ఉన్నాయని, వాగులో నీరు తగ్గితే పనులు మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా కార్యాచరణ మొదలుపెట్టాలని అంతా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కోస్గి భారాస నాయకులు వెంకట్‌నర్సిములు, కోనేరు సాయిలు, కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డిలు గురువారం కాడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణంలో జాప్యం చేసేకొద్దీ మరిన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజలు భక్తిమళ్ళ, భోగారం మార్గాన సుదూరం ప్రయాణించడంతో వ్యయప్రయాశలు తప్పడం లేదని ఆ వినతిపత్రంలో వివరించారు. కాడ అధికారి సానుకూలంగా స్పందించారు.

- న్యూస్‌టుడే, కోస్గి న్యూటౌన్

ధ్రువపత్రాల పరిశీలన కేంద్రంలో పక్కా ఏర్పాట్లు : కలెక్టర్



సహాయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ ఉద్యోగార్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నారాయణపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏర్పాట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘనీ, సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు భోజన సదుపాయం

నారాయణపేట పట్టణం: ధ్రువపత్రాల పరిశీలన కేంద్రం వద్ద పీఆర్టీయూ, తపస్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. తాగు నీటి సౌకర్యం, ఇతర మండలాల నుంచి వచ్చిన వారికి మధ్యాహ్న భోజనం అందించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారు.



శైలపుత్రిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే : జోగులాంబ ఆలయంలో గురువారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమ నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. అర్చకులు ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణ నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారిని శైలపుత్రిగా అలంకరించారు.

జిల్లాలో పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

నారాయణపేట, న్యూస్‌టుడే : జిల్లాలో పకడ్బందీగా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి మంత్రి, ఉన్నతాధికారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృశ్య మాధ్యమం ద్వారా జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమయ్యిందని, క్షేత్రస్థాయిలో అవసరాలను పరిశీలించి మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వారం రోజుల్లో వసతులు కల్పిస్తామన్నారు. సన్నరకం ధాన్యం వివరాలను ఏఈవోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



క్రీడలతో మానసిక ఉల్లాసం



హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో నిర్వాహకులు, నాయకులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కోస్గి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్-17 పోటీల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడా విభాగంలో ప్రతిభ చూపితే ఉద్యోగాలలో అవకాశాలుంటాయన్నారు. అంతకుముందు క్రీడాకారుల పరిచయంతో కార్యక్రమం ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే పోటీల్లో తొలిరోజు బాలికల విభాగంలో వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, బాలుర విభాగంలో కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సిములు, డీవైఎస్‌ఓ వెంకటేశ్, హెచ్‌ఎం కృష్ణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

శక్తిపీఠంలో ఉత్సవాలు ప్రారంభం


ప్రదక్షిణ చేస్తున్న ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, మాలధారణ భక్తులు

అలంపూర్, న్యూస్‌టుడే: జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ఈవో పురేందర్, అర్చక స్వాములు మంగళ వాయిద్యాలతో ప్రధాన ఆలయాలకు చేరుకొని ఆనతి స్వీకరించారు. గణపతి పూజలు, పుణ్యాహవాచన, కంకణధారణ, కలశస్థాపన, యాగశాలలో నాలుగు వైపులా ప్రత్యేక మండపారాధన మధ్యలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులతో మహాకలశ స్థాపన చేశారు. లోక కల్యాణార్థం మహాసంకల్పం పాటించి అఖండ దీపారాధన చేశారు. షోడశోపచార పూజలు, తదితరాలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు.

శైలపుత్రిగా జోగులాంబ: ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వంతెన నుంచి వెళ్లలేక ఆగిన సుబాబుల్ లోడు లారీ

మొత్తుకున్నా వినలే.. ఎత్తు పెంచలే!

శాంతినగర్, న్యూస్‌టుడే: భారత్‌మాల రోడ్డు వంతెనల ఎత్తు పెంచాలని రైతులు మొత్తుకున్నా, నిరసనలు చేసినా, పనులను అడ్డుకున్నా.. అధికారులు పట్టించుకోలేదు.. యాజమాన్యం ఒప్పుకోలేదు. తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న వీటి కారణంగా రైతులకు ఇదిగో ఇలా కష్టాలు తప్పవు. రాజోలి నుంచి శాంతినగర్‌కు వచ్చే రోడ్డుపైన నిర్మించిన వంతెన నుంచి వెళ్లలేక గురువారం ఆగిపోయిన సుబాబుల్ లోడు లారీ సాక్షిగా..


వేలాది గ్రామాలకు సమస్యే: గద్వాల జిల్లాలో భారత్‌మాల రహదారి ఎనభై కిలోమీటర్ల దూరం వెళుతోంది. రహదారికిరువైపులా వందలాది గ్రామాలున్నాయి. రహదారితో ప్రస్తుతం ఈ గ్రామాల నడుమ రాకపోకలు తెగిపోయాయి. అక్కడక్కడా నిర్మించిన పదుల సంఖ్యలో వంతెనలు ఇదిగో ఇలా తక్కువ ఎత్తులోనే ఉండిపోయాయి. దీంతో అటూ ఇటూ వ్యవసాయ ఉత్పత్తులతో వాహనాలు వెళ్లడం కష్టం కానుంది. కాలువ కట్టలపైనైతే ఈ రహదారిని దాటే పరిస్థితే లేకుండాపోయింది. కాలువ వరకే వంతెన నిర్మించడంతో కట్టను రహదారిలో కలిపేశారు.

నిరసనలు తెలిపినా


వంతెనల ఎత్తు విషయంలో అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. గట్టు మండలంలో ఏకంగా నిరాహార దీక్షలు చేపట్టారు. నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సమస్యపై మీడియాలో మొదటి నుంచీ కథనాలు వస్తూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురువారం తుమ్మిళ్ల రైతులు లారీలో సుబాబుల్ తీసుకువస్తూ బ్రిడ్జి వద్ద ఇబ్బంది పడ్డారు. ఎత్తు తక్కువగా ఉండటంతో తీసుకువచ్చిన సుబాబుల్‌లో కొన్ని కిందకు దించి బ్రిడ్జి దాటిని తర్వాత తిరిగి లోడు చేసుకున్నారు. ఇది రైతులకు ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనల కింద నుంచి సుబాబుల్, ధాన్యం, పత్తి, మిరప, జొన్న, పశుగ్రాసం లాంటివి రవాణా చేయాలంటే ఇదే పరిస్థితి ఎదురుకానుంది.


మహబూబ్‌నగర్ : రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి అలంకరణ


మహబూబ్‌నగర్ : శ్రీనివాసకాలనీ వాసవీమాత ఆలయంలో ఉమాదేవిగా దర్శనం


అచ్చంపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో..


శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో


కల్వకుర్తి: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

సమ్మోహనం.. సుందరరూపం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారు బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. దేవాలయాల్లో ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగజ్జననిని దర్శించుకునేందుకు ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు.

-న్యూస్‌టుడే బృందం


పెబ్బేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మహబూబ్‌నగర్ : అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో ఆర్యవైశ్యులు


కొత్తకోట : కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో బాలత్రిపుర సుందరిదేవిగా..


అమ్రాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు


ఊట్కూరు: బిజ్వార్‌లో బండారు చల్లుకునే కార్యక్రమంలో భక్తులు


గద్వాల : ప్రతిమను ఊరేగిస్తున్న తెలుగుపేట శివాలయం కమిటీ సభ్యులు


అయిజ అంబాభవానీ ఆలయంలో..


గద్వాల గంటవీధిలో..


ఊట్కూరు: అంబాత్రయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామి


నాగర్‌కర్నూల్: అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు సందర్భంగా బోనాలతో మహిళలు


అచ్చంపేట: కుంకుమార్చన చేస్తున్న భక్తులు


వనపర్తి: చిట్యాలలో..



మహబూబ్‌నగర్ : వేంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరీఆలయంలో భక్తుల సందడి

వృత్తి ఎస్పీ.. ప్రవృత్తి చిత్రలేఖనం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వృత్తిలో ఎస్పీగా ఉంటూ చిత్రలేఖనం, సాహిత్యాన్ని ప్రవృత్తిగా కొనసాగిస్తున్నారు రావుల గిరిధర్. తల్లి చీరలపైన వేసే డిజైన్లు, ఇంటి ఎదుట అలంకరించే ముగ్గులను చూసి చిత్రాలను గీయడంపై ఆసక్తిని పెంచుకున్నారాయన. సాహిత్యంపై మక్కువ కనబరుస్తూ కవితలు రాశారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. చిత్రాలు గీస్తూ, కవితలు రాస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వనపర్తి ఎస్పీ గిరిధర్.

స్వచ్ఛంద కార్యక్రమాల్లో

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు రావుల క్షేమ, నిరంజనాచారిల కుమారుడు గిరిధర్. ఆయన పీజీ వరకు చదువుకున్నారు. పలు స్వచ్ఛంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సామాజిక సేవలు ఇష్టంగా భావించేవారు. 2007లో జరిగిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలో జైల్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగం సాధించి వరంగల్‌లో విధులు నిర్వహించారు. 2010లో రాసిన సివిల్స్‌లో ఆయన ఉద్యోగం సాధించి డీఎస్పీగా గురజాల, భైంసా, సుల్తానాబాద్, గద్వాల్‌లో పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది మహబూబాబాద్‌లో ఏఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం పోలీసు శాఖలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2017లో ఎస్పీగా పదోన్నతి పొంది డీసీపీగా పనిచేశారు. జిల్లాల వనపర్తి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.






చిత్రాలను గీస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ప్రవృత్తిలో గురువు తల్లి

తన తల్లి క్షేమను ఆదర్శంగా తీసుకుని చిత్రలేఖనంలో ఆసక్తిని పెంచుకున్నారు. ఆమెకు డిజైనింగ్‌లో ప్రవేశముంది. ఇంటి వద్ద ఆమె వేసే వివిధ రకాల డిజైనింగ్ బొమ్మలను చూసి అనుకరించేవారు. ఇంటి ఎదుట వేసే వాటిని చిత్రరూపంలో ప్రతిబింబించడంలో ఆసక్తి కనబర్చేవారు. ఇలా సమయం దొరికినప్పుడల్లా ఆయనకు ఆసక్తి కలిగించే బొమ్మలను గీసేవారు. ఇప్పటి వరకు 60 వరకు బొమ్మలను గీశారు. ఆయన గీసిన బొమ్మల్లో జంతుప్రపంచం, పక్షులు, చెట్లు, సెలయేరు వంటి ప్రకృతి రమణీయతలను తన చిత్రాల్లో పొందుపరుస్తున్నారు. సాహిత్యంలోనూ మక్కువ ప్రదర్శిస్తున్నారు. కవితలంటే ఆయనకు ఎంత ప్రాణం. శోధన పేరిట ఆయన కవిత సంపుటి 2020 సంవత్సరంలో ప్రచురితమైంది. పలు కవితలతో కూడిన మరో సంపుటి అహంబ్రహ్మాస్మి అనే కవిత సంపుటి ప్రచురణలో ఉంది.

సమాజ హితమే పరమావధి : సమాజ హితమే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేస్తే ప్రజా సమస్యలకు తావుండదు. సేవ చేయాలన్న లక్ష్యం చిన్ననాటి నుంచే అలవడింది. పోలీసు శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉంటూ నా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన శ్రద్ధ వహిస్తున్నా. శాంతిభద్రతల లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నా. వృత్తిలో ఆదర్శంగా ఉండటంతో పాటు ప్రవృత్తిపై సమయం దొరికినప్పుడల్లా శ్రద్ధ చూపుతున్నా.

- రావుల గిరిధర్, ఎస్పీ

పల్లె ఓటర్లు @ 23,22,054

పురుషుల కంటే 13,765 మంది మహిళలు అధికం

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 23,22,054 ఓటర్లున్నట్లు లెక్క తేల్చింది. పురుషులు 11,54,128 మంది ఉండగా, మహిళా ఓటర్లు 11,67,893 మంది ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 13,765 మంది అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరుచేసి ఈ జాబితాను గత నెల 13న ప్రచురించారు. గ్రామ పంచాయతీల్లో వీటికి సంబంధించి గత నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 28న తుది జాబితా ప్రచురించగా దీన్ని ఎన్నికల సంఘం వెలువరించింది. దీని ఆధారంగా జిల్లాల వారీగా పంచాయతీలు, వార్డుల్లోని ఓటర్లతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మరో పర్యాయం ఓటరు నమోదుకు కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

* నాలుగు జిల్లాల్లో అతివలదే పైచేయి.. : తాజాగా ప్రచురించిన గ్రామ పంచాయతీ ఓటర్ల ఆధారంగా నాలుగు జిల్లాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు తేలింది. అత్యధికంగా నారాయణపేట జిల్లాలో పురుషుల కంటే మహిళలు 7,348 మంది అధికంగా ఉండటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళా ఓటర్లు ఏకంగా 5,562 మంది అధికంగా ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,118 మంది మహిళలు అధికంగా ఉన్నారు. వనపర్తి జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 753 మంది ఎక్కువగా ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పురుష ఓటర్లు మహిళల కంటే 1,016 మంది అధికంగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల వివరాలు, పంచాయతీలు, వార్డులు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	14	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183
నాగర్‌కర్నూల్	20	464	4,140	3,23,705	3,22,689	13	6,46,407
వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	4	3,67,521
జోగులాంబ	12	255	2,390	1,91,313	1,96,875	7	3,88,195
నారాయణపేట	11	280	2,544	1,98,199	2,05,547	2	4,03748

నవరాత్రి వేడుకల్లో రాజవంశీయులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలిటెక్నిక్ బంగ్లా పక్కన గుడిలో గురువారం నిర్వహించిన నవరాత్రి పూజల్లో రాజా రామేశ్వర్‌రావు వారసుడు రాజా కృష్ణదేవరాయుడు కుమారుడితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.


రాజవంశీయులతో అఖిల పక్ష ఐక్యవేదిక నాయకులు

అనంతరం జిల్లా అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు రాజా వారిని కలిసి సన్మానించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సతీశ్ యాదవ్ మాట్లాడుతూ తరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలక ప్రాత పోషించారు.


సెంచరీతో రాణించిన నిజామాబాద్ జట్టు క్రికెటర్ విక్రాంత్‌రెడ్డి(137 పరుగులు)

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 పరుగులకు కుప్పకూలింది. జట్టులో ఆలెరాండర్ తక్షల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ; మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల్లో మార్పు కోసమే పాదయాత్ర

ఉండవల్లి, న్యూస్‌టుడే: భావితరాలకు ఉపయోగపడే విధంగా నడచుకునేలా ప్రజల్లో మార్పు కోసమే 'బాపూ బాటలో సత్యశోధన పాదయాత్ర' చేపట్టినట్లు విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా. శివార్చక విజయకుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభమైన (100 రోజుల్లో 1000 కి.మీ) పాదయాత్ర గురువారం ఉండవల్లికి చేరుకుంది. గ్రామస్థులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను తల్లిదండ్రులు, పెద్దలు అలవాటు చేయాలన్నారు. చేనేత వస్త్రధారణకు ప్రోత్సాహం, మద్యం, మత్తు పదార్థాల నివారణ, స్వదేశీ వైద్యం ఆదరించటం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం, యోగా, పౌష్టికాహారం, నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య అందించడం తదితరాలను వివరించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు దేవన్న, తదితరులు పాల్గొన్నారు. యాత్ర శుక్రవారం ఉండవల్లి నుంచి బొంకూరుకు సాగనుంది.


కరపత్రాలు అందజేస్తున్న శివార్చక విజయకుమార్ తదితరులు

పోలీస్ అధికారుల్లో నైపుణ్యాల మెరుగుకు కృషి : డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఏఎస్పీ రాములు, అధికారులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీస్ అధికారుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారుల నైపుణ్య కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నేరస్థులు ఎవరూ తప్పించుకోవడానికి వీలు లేకుండా నేరాల విచారణ, పరిశోధన మెరుగుపడాలన్నారు. కార్యశాలలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి. జానకి, ఏఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఏఎస్పీ రామేశ్వర్, వనపర్తి ఏఎస్పీ రామ్‌దాస్, నారాయణపేట ఏఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నర్సింహులు, గద్వాల డీఎస్పీ నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల, న్యూస్‌టుడే : విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముండే ఓ విద్యార్థిని(17) మహబూబ్‌నగర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటాక ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తర్వాత గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికెన్ ధరలు

ఫాంరేటు	112-00
రిటైల్	134-00
డ్రెస్డ్	194-00
స్కిన్‌లెస్	221-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728

ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836



సమస్య : ఆవాసాల మధ్యలో పాడుబడిన బావి ఉంది. పిచ్చి మొక్కలు పెరగడం, మురుగు నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. చర్యలు తీసుకోవాలి.

- సుర్మి సుదర్శన్, సజనాపూర్

సమాధానం : బ్లీచింగ్ పౌడరు చల్లడంతోపాటు అయిల్ బాల్స్ వేయిస్తాం. పిచ్చి మొక్కలు తీయిస్తాం. పాడుపడిన బావి విషయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

-సుజాత, గ్రామ కార్యదర్శి

సమస్య : గత 15 రోజులుగా బీసీ కాలనీలో నీరు సక్రమంగా సరఫరా కావడంతో లేదు. ఉదయం సమయంలో 5, 6 బిందెలు మాత్రమే వస్తున్నాయి. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు.

- సందోపోళ్ల మోహన్, గడిమున్కన్‌పల్లి, దామరగిద్ద మండలం.

సమాధానం : గేట్ వాల్ మరమ్మతు కారణంగా ఉపరిత ట్యాంకులో నీరు నిండటం లేదు. సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాం. రెండురోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

- రాజ్‌నారాయణ, పంచాయతీ కార్యదర్శి, గడిమున్కన్ పల్లి.

– న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం

జూనియర్ కళాశాల మంజూరు చేయరా?

ప్రశ్నిస్తున్న మరికల్ వాసులు

న్యూస్‌టుడే-మరికల్ కూడలి

ఇటీవల మండలంగా మారిన గుండుమాల్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 169వ జీవోను విడుదల చేసింది. అంతే కాకుండా 2024-25 ఏడాదిలోనే కళాశాల ఏర్పాటుకు రూ. సుమారుగా రూ. 8 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో సొంత భవనాన్ని నిర్మించబోతున్నారు. గుండుమాల్‌కు కళాశాల ఏర్పాటు చేయడం మంచిదేనని, కానీ ముందు నుంచే మండలంగా ఉన్న మరికల్‌ను పాలకులు విస్మరించారని వాపోతున్నారు. అదే జీవోలో మరికల్ కళాశాల కూడా ఏర్పాటు చేస్తు బాగుండేదన్న భావన వ్యక్తమవుతోంది.

● ఇటు నారాయణపేట, అటు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాలతో పాటు వనపర్తి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన అమరచింత, ఆత్మకూర్‌లకు సమ దూరంలో మరికల్ ఉంటుంది. జాతీయ రహదారిపై ఉన్న ఈ పట్టణ జనాభా 15వేలకు పైగా ఉంది. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. విద్యాపరంగా మాత్రం చాలా వెనుకబడి ఉంది.



ఏర్పాటుకు అనుకూలంగా విద్యాశాఖ వనరుల కేంద్రం

ఇక్కడ ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఉర్దూ మాధ్యమ ఉన్నత పాఠశాల ఉంది. ప్రైవేటు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఏటా వందలమంది విద్యార్థులు పదోతరగతి ఉత్తీర్ణులై బయటకు వస్తున్నారు. వారంతా వ్యయ ప్రయాశలకు ఓర్చి ధన్వాడ, దేవరకద్ర, మహబూబ్‌నగర్, నారాయణపేటలకు వెళ్లి వస్తున్నారు. ఈ సమస్యను పదే పదే విన్నవిస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికల్‌తో పాటు రాష్ట్ర సరిహద్దున ఉన్న కృష్ణా మండలానికి ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు కావాల్సి ఉంది. కళాశాల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలని యోచిస్తున్నట్లు యువజన సంఘాల సభ్యులు 'న్యూస్‌టుడే'తో అన్నారు.

త్వరలో ఏర్పాటు: ఎమ్మెల్యే పర్ణిక

మరికల్‌కు అతి త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు అవుతుందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. అన్ని చర్యలు పూర్తయ్యాయని, జీవో రావడం ఒక్కటే మిగిలిందన్నారు. ఈ నెలలోనే మంజూరవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరుగబోయే సీఎం పర్యటనలో పేట వైద్య కళాశాల ప్రారంభోత్సవంతో పాటు మరికల్ జూనియర్ కళాశాల ప్రారంభింపజేస్తామన్నారు.

ఐటీ, సమాచారం ఎస్‌ఐగా పవన్‌కుమార్

నారాయణపేట, న్యూస్‌టుడే : నారాయణపేట ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సమాచారం విభాగానికి ఎస్‌ఐగా ఎం.పవన్‌కుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు పని చేసిన నవీన్‌కుమార్ హైదరాబాద్ సైబర్ సెక్యురిటీ విభాగానికి బదిలీపై వెళ్లారు. కొత్త ఎస్‌ఐ బాధ్యతల అనంతరం ఎస్పీ యోగేశ్‌గౌతంను మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యార్థికి కలెక్టరు అభినందన

నారాయణపేట, న్యూస్‌టుడే : రెడ్ 3కే రన్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లాకు చెందిన విద్యార్థి కిరణ్‌కుమార్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. గురువారం జిల్లా సంక్షేమ అధికారి ఖలీల్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థితో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని గూడూరు గ్రామానికి చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తాచాటడంపట్ల కలెక్టర్ అభినందిస్తూ శాలువ, జ్ఞాపిక అందజేశారు.

పేటలో న్యాయవాదుల విధుల బహిష్కరణ

నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : మాదన్నపేట సీసీఎస్ పోలీసులు న్యాయవాది అబ్దుల్ కలీంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం నారాయణపేటలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హత్యలు, దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నంద నామాజీ అన్నారు. కార్యక్రమంలో రఘువీర్‌యాదవ్, లక్ష్మీపతి, విజయకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్, ప్రవీణ్ నామాజీ, వినోద్ పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయంలో వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 62 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు జలవిద్యుదుత్పత్తి, 4 గేట్లు ఎత్తి 68 వేలు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 43 వేల క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 42 వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 46 వేలు చేరుతుండగా, దిగువకు 55 వేల క్యూసెక్కుల వదులుతున్నారు.

తెరపై ఈనాడు

దేవర: వనయాం(కోస్గి), వెంకటరమణ(మక్తల్), మహోహర్ (నారాయణపేట), **సత్యం సుందరం:** మహేశ్వర్(నారాయణపేట)

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్, మక్తల్ రూరల్

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : టమాట రూ.70, వంకాయలు రూ.60, ముళ్ల వంకాయలు రూ60, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.70, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, గోకరకాయ రూ.70, క్యాప్సికం 70, బీన్స్ 90, కాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ. 60. క్యాబేజీ రూ.40, ఉల్లి రూ.70, చింతపండు రూ.120.



దామరగిద్ద: మాణిక్యగిరిలో భవానీమాత అలంకరణ



దామరగిద్ద: బాలా త్రిపురసుందరి దేవిగా వాసవిమాత



ధన్వాడ కన్యమ్మ ఆలయంలో అమ్మవారి అలంకరణ



కోస్గిలో శివసాయి ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న మాత



ఎలిగేండ్లలో అమ్మవారు



చిత్తనూరులో దేవీ ప్రతిమ

జగన్మాతా నమోస్తుతే!

జిల్లావ్యాప్తంగా గురువారం శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఊరేగింపుల నడుమ విగ్రహాలను మండపాల్లోకి చేర్చి పూజలు నిర్వహించారు. తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అన్నదానాలతో ఆధ్యాత్మిక శోభ విరిసింది. **- న్యూస్‌టుడే, బృందం**



నారాయణపేట అశోక్ నగర్ మలాంబికా దేవాలయంలో అలంకరణ



నారాయణపేట శక్తిపీఠంలో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు



కృష్ణా: భవానీ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



మరికల్ శివాలయంలో ఎస్పీ పూజలు



ధన్వాడ అంబా భవాని ఆలయంలో ...



గుంతలమయం... టీచర్స్ కాలనీ రహదారి

మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసే క్రమంలో అంతర్గ రోడ్డు ధ్వంసమైందని కోస్గి టీచర్స్ కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రి సమయంలో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వార్డు అధికారి వెంకటయ్యను వివరణ కోరగా అంతర్గ రోడ్డు సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని వివరించారు.

- న్యూస్‌టుడే, కోస్గి న్యూటౌన్

పైపులు పగిలి.. నిలిచిన నీటి సరఫరా



జక్లేర్, గుడిగండ్ల గ్రామాల మీదుగా రహదారుల పక్కన ఫైబర్‌నెట్‌కోసం గోతులు తీసే సమయంలో పైపులైన్లు పగిలిపోయి తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు అవస్థలు పడుతూ బోరుబావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. అధికారులు ఈ సమస్యపై ఏమాత్రం స్పందించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గుత్తేదారుడితో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా, సమస్య పరిష్కారిస్తానని అంటున్నారు..

- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం



పొంచి ఉన్న ప్రమాదం

మూలమలుపులో తారు రోడ్డు పూర్తి స్థాయిలో పాడయ్యిందని, ప్రమాదాలు పొంచి ఉన్నాయని బిజ్జారం గ్రామస్థులు అంటున్నారు. గ్రామానికి వెళ్లే దారిలో వంతెన దాటగానే వర్షాలకు రోడ్డు కోతకు గురయ్యింది. ఈ దారిలో రాత్రీపగలు లేకుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రాత్రి సమయంలో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పలుమార్లు వాహనదారులు కిందపడి గాయాలు పాలైన ఘటనలు కూడా ఉన్నాయి.. ఇకనైనా సంబంధిత అధికారులు తారురోడ్డును బాగుచేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కోస్గి గ్రామీణం

పట్టు తప్పితే ప్రాణం ఉంటుందా?



పత్తి తీతకు ధన్వాడ మండలానికి వచ్చిన కూలీలు తిరుగు ప్రయాణంలో నారాయణపేట మండలానికి ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఆటోపై భాగాన కొంత మంది కూలీలు ఉండగా వెనుక భాగాన ఓ వృద్ధురాలి ఒక కాలు ఆటో లోపల మరొకటి బయట పెట్టి కూర్చుంది. వాహనం నడపడంలో డ్రైవర్ ఏమరపాటు వహించినా, ఆదే వేగంతో సైడ్ ఇచ్చేందుకు యత్నించినా కూలీలు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. ఈ విషయంలో రవాణా శాఖాధికారులు దృష్టి సారించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, ధన్వాడ

అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చింత రవి , ఐకేపీ ఏపీఎం నిర్మల అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రూ. 6లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ పనులు గురువారం ప్రారంభించి మాట్లాడారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు అరవింద్ కుమార్, అశోక్ కుమార్ గౌడ్, మాజీ సర్పంచి ఎం.భాస్కర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు డి.హన్మంతు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి భాగ్యమ్మ, కోశాధికారి ప్రసన్న లక్ష్మి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీయూ సహాయాచార్యుడికి పేటెంట్



పీయూ గణితశాస్త్ర సహాయ ఆచార్యుడు డా.మధును అభినందిస్తున్న ప్రిన్సిపల్ డా.చంద్రకిరణ్, ఇతర ఆధ్యాపకులు

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్రంలో సహాయ ఆచార్యుడిగా పని చేస్తున్న డా.మధు రిమోట్‌తో పనిచేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అనే పరికరం నమూనా రూపొందించారు. మరో ఐదుగురు సహాయ ఆచార్యులతో కలిసి పరికరాన్ని రూపొందించిన ఆయనకు భారత ప్రభుత్వం మేధో సంపత్తి హక్కులను కల్పించింది. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని పీయూలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకిరణ్, ఇతర అధ్యాపకులు అతడిని అభినందించారు.

రాంకిష్టాయపల్లిలో దాహం దాహం

ధన్వాడ, న్యూస్‌టుడే : మండలంలోని రాంకిష్టాయపలి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదు. మూడు రోజుల కిందట సోర్సు బోరు పరిధిలోని నియంత్రిక కాలిపోయింది. రైతుల మోటార్లతో కూడిన ఈ నియంత్రిక మరమ్మతుకు ఎవరూ ముందుకు రావడంలేదు. మరో నియంత్రిక పరిధిలో సోర్సు బోరు ఉన్న మోటారు లేదు. నీళ్లలేని బోరు వద్ద ఉన్న మోటారును తొలగించాల్సి ఉండగా, ఎవరూ పట్టించుకోవడంలేదు. తక్షణమే వృథాగా ఉన్న మోటారును నీళ్లున్న బోరుకు బిగించి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ధన్వాడ, న్యూస్‌టుడే : మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులపై శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి సమీక్ష నిర్వహించనున్నారని తహసీల్దారు సింధూజ తెలిపారు. తహసీల్దారు కార్యాలయం సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నారని ఆమె వెల్లడించారు.


డిజిటల్ కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొత్తపల్లిలో గురువారం చేపట్టిన సర్వేను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మరో ఇద్దరు సిబ్బందితో కలిసి 10 బృందాలుగా సర్వే చేపడుతున్నామని ఎంపీడీవో ధనుంజయ గౌడ్ వివరించారు. గ్రామంలో 172 కుటుంబాల ఆధారంగా సర్వే చేపడుతున్నామన్నారు. కుటుంబంలో పెద్ద వయసున్న మహిళల పేరునే ప్రామాణికంగా తీసుకోవాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. కొత్తపల్లి గ్రామానికి ప్రత్యేక ఉప కలెక్టర్ విశాలాక్షి పర్యవేక్షకులుగా ఉన్నారని, సర్వే ఫారంలో ఆమె సంతకం తప్పకుండా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో లక్ష్మీనరసింహారాజు, తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద, న్యూస్‌టుడే : అయ్యవారిపల్లెలో సిక్తా పట్నాయక్ డిజిటల్ సర్వే తీరును పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. చనిపోయిన, పెళ్లి చేసుకుని వెళ్లిపోయినవారి పేర్లు తొలగించాలన్నారు. నారాయణపేట ఆర్డీవో మధుమోహన్, ఎంపీడీవో సాయిలక్ష్మి, ఎంపీవో ఉదయ్‌శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : ముక్తిపాడ్ గ్రామంలో డిజిటల్ కార్డు కోసం గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఇంటింటి సర్వే చేపట్టామని డీపీవో కృష్ణ అన్నారు. కుటుంబాల సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు అందిస్తామని అన్నారు. కుటుంబ డిజిటల్ కార్డుతో పలు రకాల ఉపయోగాలు ఉన్నాయని అన్నారు.

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ కుటుంబ కార్డు కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికచేసిన పేట పురపాలిక పరిధిలోని 15వ వార్డులో గురువారం కలెక్టర్ ఇంటింటి సర్వేను పరిశీలించారు. పుర కమిషనర్ సునీత, వార్డు కౌన్సిలర్లతో కలిసి స్వయంగా సర్వే జరుగుతున్న ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.



కొత్తపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

తొలి రోజు అర్హత పరీక్షల నిర్వహణ



గురువారం రాత్రి కేజీబీవీలో నిర్వహిస్తున్న అర్హత పరీక్ష

ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడలో మొదలైన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీల తొలి రోజు రెఫరీల సహకారంతో పీడీలు, కోచ్‌లు క్రీడాకారుల అర్హత పరీక్షను నిర్వహించారు. రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వసతి ఏర్పాట్లు చేశారు. అర్హత పరీక్షను ఇక్కడే నిర్వహించారు. పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉదయం ఏడు గంటల నుంచే రావడం మొదలెట్టారు. ముందు ఖమ్మం జిల్లా క్రీడాకారులు రాగా ఆ తర్వాత ఒకరి తర్వాత మరొకరు వచ్చారు. రెఫరీలు, పీడీలు తదితరులకు స్థానిక కన్వెన్షన్ హాలులో ఏర్పాట్లు చేశారు. అప్పాజీ మైదానంలో వేదిక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు, డీవైఎస్‌వో వెంకటేశ్‌లతో పాటు పీడీ రవికుమార్, సాయినాథ్, బాల్‌రాజు, కోచ్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించనున్నారు.

గంజాయి నూనె రవాణాదారుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాసరావు, ముసుగులో నిందితులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై గంజాయి నూనె (హాష్ ఆయిల్)ను రవాణా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం ఏనుగొండ సమీపంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ధర్మేంద్రరాయ్, నరెట్టమ్‌రాయ్ గంజాయి నూనెను హైదరాబాద్, రాయచూర్ ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఎండు గంజాయి ఆకులతో ఈ నూనె తయారు చేస్తారు. ఆ నూనెను మత్తు కోసం సిగరెట్ తాగేటప్పుడు వాడుతారు. గురువారం ఇద్దరు నిందితులు హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు గంజాయి నూనెను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం వచ్చింది. వారు మహబూబ్‌నగర్‌లోని పిస్తా హౌజ్ వద్ద తనిఖీలు చేయగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.25లక్షల విలువ చేసే గంజాయి నూనె లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శివ, సిబ్బంది మౌలాలీ, శివదాస్, భరత్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పశువులు.. ప్రమాద హేతువులు



మక్తల్ జాతీయ రహదారిపై పశువులు

న్యూస్‌టుడే- మక్తల్ గ్రామీణం

జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాల్లో రహదారిపై పశువులు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. రేయింబవళ్లు తేడా లేకుండా సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు. రోడ్డుపై వెళుతున్న మూగజీవులు వాహనాల ధ్వనులు, హారన్ల చప్పుడుతో ఉలిక్కిపడి లేచి పరుగెత్తుతున్నాయి. ఈ క్రమంలో వాహనదారులకు అడ్డంగా రావడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో పశువులు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి కోలుకోలేని వారు ఎందరో ఉన్నారు. మక్తల్, మాగనూరు, మరికల్, కోస్గి, ధన్వాడ, మద్దూరు, నారాయణపేటల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కొంత మంది రైతులు తమ పశువులను మేతకు వదిలేయడంతో అవి రహదారులపైకి వస్తున్నాయి. యజమానులు కాపరులను పెట్టుకోకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎక్కువ మొత్తంలో పశువులు ఉన్న రైతులు వాటికోసం ప్రత్యేకంగా కాపరులను నియమించుకుంటున్నారు. ఒకటి, రెండు పశువులు ఉన్నవారు వదిలేస్తున్నారు. యజమానులకు నోటీసులు ఇస్తామని గతంలో నారాయణపేట పురపాలక అధికారులు చెప్పినా ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

యజమానులపై చర్యలు తీసుకుంటాం

పశువుల పెంపకందారులు, యజమానులు రహదారులపైకి వదిలేస్తే చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ అధికారుల సహాయంతో జరిమానాలు విధిస్తాం. గతంలో కూడా రహదారి పక్కన నాటిన హరితహారం మొక్కలను పశువులు మేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. యజమానులకు నోటీసులు ఇచ్చేలా చూస్తాం.

- చంద్రశేఖర్, సీఐ, మక్తల్.

ధన్వాడలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో మహిళలు

ధన్వాడ, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధిలో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. శ్రీరాం ఫ్రెండ్స్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అర్ధ రాత్రి వరకు కొనసాగింది. రంగు రంగుల పూలతో బతుకమ్మలను రూపొందించి మహిళలు, పిల్లలు చుట్టూచేరి పాటలకు అనుగుణంగా పాదం కలిపారు. ముగింపులో స్థానిక లక్ష్మీవేంకటేశ్వరస్వామి కోనేరులో నిమజ్జనం చేశారు.

ఇసుక అక్రమ రవాణా: అధికారులపై వేటు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: దుందుభి వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాలో విఫలమైన అధికారులపై వేటు పడింది. ప్రత్యేక నిఘా బృందం సేకరించిన సమాచారం మేరకు వంగూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, బిజినేపల్లి ఎస్సైలు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీంతో వీరిని ఠాణా నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి డివిజన్ల పరిధిలో మొదటిసారి ఎస్సైలపై వేటు పడటంతో గనులు, రెవెన్యూ, పోలీసు అధికారుల్లో చర్చ మొదలైంది. మార్చి నుంచి జూన్ వరకు వాగు పరిధిలో విధులు నిర్వహించి వసూళ్లకు పాల్పడిన అధికారుల్లో భయాందోళన మొదలైంది.

● దుందుభి వాగు పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకున్న వ్యాపారులు ఈ ఏడాది జులై వరకు టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు.